న్యూజెర్సీ కళాసమితి,ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక నిర్వహించిన '97 కథల పోటీలలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.



# మనకీర్తి మంచు కొండరా!

-సారె రామమోహన రావు

మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. వేసవి కాలవుటెండ చెంద్రనిప్పులు చెరుగుతోంది.

నిరుద్యోగి చిన్నికృష్ణ రోడ్డు మీద నడుస్తున్నాడు.

అతని కడుపులో ఆకలి నకనకలాడుతోంది. జేబులు తడుముకుని వున్న చిల్లర లెక్క పెట్టుకున్నాడు. రూపాయి కంటే ఎక్కువ లేదది. ఆ వూట హోటల్లో భోజనం చెయ్యాలంటే పదిహేను రూపాయలుండాలి? ఇంకా పద్నాలుగు రూపాయలు తక్కువ. హోటల్ వారు వూరికే భోజనం పెడతారా?

ఎలా?

చిన్నికృష్ణ బరువుగా బాధగా నిట్టూర్చాడు.

అతడికి ఈ మధ్యే నెల రోజుల తేడాతో అమ్మా నాన్న పోయారు. ఎవరూ దిక్కులేదతడికి. వెనకాస్తి పాస్తులేమీ లేవు. అతడి రెక్కలే అతడికి ఆధారం. చేతిలో పైసా లేక వుద్యోగాల పేరుతో ఇంటర్వ్యూలకు చదువుకునే రోజుల్లో సంపాదించుకున్న వెండి కప్పలన్నీ అమ్మేసుకున్నాడు. ఫైనల్‌గా డిగ్రీ సంపాదించి పెట్టిన గోల్డ్‌మెడల్ కూడా అమ్మేసుకున్నాడు.

అయినా అతడికి వుద్యోగం దొరకలేదు.

తనకి కడుపెలాగడుస్తుందో అర్థం కావడం లేదతడికి

కాని–

ఏదో ఓ ప్రయత్నం చెయ్యాలి కదా!

అందుకే చిన్నకృష్ణ ఎదురుగా వున్న విజయవాడ లంచ్ హోమ్‌ని సమీపించాడు.

ప్రొప్రయిటర్‌ని కలిశాడు.

"మీల్సెంతసార్?" అని అడిగాడు.

"పదిహేను రూపాయలు" చెప్పాడు హోటల్ ఓనరు.

"సార్! నేనునిరుద్యోగిని, ఆకలిగా వుంది. కాస్త భోజనం పెడతారా? నా దగ్గర డబ్బు లేదు" దీనంగా అడిగాడు ఓనర్ని.

"చాల్చాల్లేవయా! పెద్దమనిషి! నేను వూరికే నీకెందుకు భోజనం పెట్టాలి? నీ తాత ముత్తాతలు సంపాదించిన ఆస్తేమీ నా దగ్గరలేదు. వెళ్లెళ్ళు!" చీదరించుకునాడు ఓనరు.

"పోనీ మీ హోటల్లో కప్పలు కడుగుతాను సార్" మరింత దీనంగా అర్థించాడు చిన్నికృష్ణ.

"పోపోవయ్యా! మా గొప్ప సలహా చెప్పావు. మా దగ్గర కప్పలు కడగడానికి బోలెడు మంది స్టావున్నారు. ఫో!ఫో" గసురుకున్నాడు. ఓనరు

చిన్నికృష్ణ హతాశుడయ్యాడు.

బరువుగా బాధగానిట్టూర్చి వెనుకకు మరలాడు.

అదే సమయంలో–

ఓ అరవై ఏళ్ళ వృద్ధుడు మరో రోడ్డు మీద నడుస్తున్నాడు.

నడిచే ఓపిక లేక అంగుళానికో అడుగు చొప్పన అడుగులేస్తున్నాడు.

ఆ వృద్ధుని కళ్లలో దిగులు.

దానికితోడు కడుపులో ఆకలి అలజడిచేస్తోంది.

కడుపునింపుకోవడం ఎలా?

ఈ ఆకలిబాధని అణుచుకోవడం ఎలా?

చేతిలో పైసాలేదు.

తన ఆకలి ఎలా తీరుతుంది?

ముసలివాడి కళ్ళల్లోనీళ్ళు నిలిచాయి.

ఆఫీసర్లు అయిన తన కొడుకులిద్దరూ పెళ్ళాల మాటలు విని, ఈ రోజు ఉదయమే తనని ఇంట్లోంచి కట్టుబట్టలతో గెంటేశారు. కొడుకులు అడ్డాల్లో బిడ్డలౌతారు. కాని గడ్డాలొచ్చాక బిడ్డలౌతారా?

వృద్ధుడు వేదనగా కళ్ళుతుడుచుకున్నాడు.

ఎదురుగా అతడికి శ్రీనివాసా పార్లర్ కనిపించింది.

ఆ పార్లర్ వాడు వేడివేడిగా ఇడ్లీలు, బోండాలు, వుల్లిగారెలు అమ్ముతున్నాడు.

ముసలాడు నెమ్మదిగా శ్రీనివాసా పార్లర్ని సమీపించాడు.

"బాబు! కడుపులో ఆకలి కాలిపోతోంది. నీ తండ్రిలాంటి వాడిని రెండిడ్లిన్ను పెట్టించవూ?" జాలిగా అడిగాడు.

"రెండిడ్లీ రెండ్రూపాయిలు. వున్నాయా?" అడిగాడు ఓనరు.

"డబ్బులుంటేనే నేనే కొనుక్కొందును బాబూ!" దీనంగా అన్నాడు. ముసలాయన.

"ఇదేమైనా ధర్మసత్రమన్నానుకున్నావా?... వుట్టినే పెట్టడానికి... నడవతలికి... గసిరాడు పార్లర్‌వాడు.

ముసలాడు ఆ ఓనర్ని జాలిగా నిస్సహాయిగా చూశాడు.

తరువాత బరువుగా బాధగా వెనుదిరిగాడు.

అతడి కడుపులో ఆకలి కేకలు వేస్తూనే వుంది.

సరిగ్గా అదే మిట్టమధ్యాహ్నం వేళ

విజయాకేఫ్ ముందు ఓ బిచ్చగత్తె తన ముగ్గురు బిడ్డలతో దీనంగా నిలబడి–

"బాబయా! రెండ్రోజుల్నుంచి నాకు, నా బిడ్డలకి తిండి లేదు. కూసింత అన్నమో, టిఫెనోపెట్టి మమ్మల్ని కాపాడండి బాబు" అంటూ ఆ యజమానిని దీనంగా అర్థించింది.

కళ్ల నీళ్ళు పెట్టుకుంది.

కాళ్ళా వేళ్ళా పడింది.

పదేపదే తమ కడునింపమని వేడుకొంది.

కాకుంటే తన పిల్లలు కడుపైనా నిండుతుంది.

కాని–

విజయాకేఫ్ యజమాని మనసు కరగలేదు.

అతడికి జాలి కలగలేదు

పైగా–

"పోవే! దొంగముండా! నీకు నీ పిల్లలకు తిండి పెట్టడానికి నీకేమైనా అచ్చువున్నానుకున్నావా!

ఫో అవతలికి అంటూ అదే పనిగా కసురుకున్నాడు.

పాపం!

ఆ బిచ్చగత్తె తన ముగ్గురు పిల్లలతో అక్కడి నుంచి అతి దీనంగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

రాత్రి పదిగంటలయింది

వూరంతా సద్దుమణుగుతోంది.

విజయవాడ లంచ్‌హోమ్ ఓనర్ మీల్స్ అమ్ముకోగా మిగిలిన దేశాడు అన్నాన్ని, బిందెడు సాంబారుని, గంపెడు కూరల్ని పక్కనే వున్నా మురుగు కాలువలో పనివాళ్ళ చేత పడేయించాడు.

సరిగ్గా అదే సమయంలో–

శ్రీనివాసా పార్లర్ ఓనరు అమ్ముకోగా మిగిలిన అరవై ఇడ్లీని, వంద బోండాలని, యాభై గారెలని పక్కనే వున్న మురుగు కాలవలో కలిపేశాడు.

ఆ సమయంలో–

విజయాకేఫ్ ఓనరు బిందెడు అన్నాన్ని, బిందెడు రసాన్ని, గంపెడు కూరలని, ఇంకా ఇడ్లీ, బోండా, గారెలని రెండు బుట్టలతో మురుగు కాలవలోనికి విసిరేయించాడు.

రాత్రి పన్నెండు గంటలకు వూరింకా సద్దుమణిగిన వేళ...

ఆ నిరుద్యోగి చిన్నికృష్ణ...

ఆ వృద్ధుడు...

ఆ బిచ్చెగత్తె, ఆమె ముగ్గురు బిడ్డలు...

ఆకలితో అలమటించిపోతూ...

అలముకొన్న ఆ అంధకారం...

అలాగే సొక్కి.....సోలి....

జాలిగా నిద్రపోతున్న సమయాన...

"మన తల్లి అన్నపూర్ణ...
మన్న అన్న దాన కర్ణ....
మన భూమి వేద భూమిరా!
తమ్ముడు! మన కీర్తి మంచుకొండరా!"

–అంటూ మహాకవి శ్రీశ్రీ పాటు అతి దయనీయంగా దూరంగా ఎక్కడి నుంచో మైక్‌లో వినిపిస్తోంది. వాళ్ళ కడుపులో ఆకలి "అన్నమో! రామచంద్రా!!" అంటూ ఇంకా కేకలు వేస్తూనే వుంది.